క్లుప్తంగా

పీఎస్‌-4 హోటల్‌ను మూసేయాలి



మాట్లాడుతున్న టీటీడీ బోర్డు మాజీ సభ్యుడు ఓవీ రమణ

తిరుపతి కల్చరల్: ప్రజల ఆరోగ్యాలతో చెలగాటమాడే పీఎస్‌-4 హోటల్‌ను మూసివేయాలని, హోటల్ యాజమాన్యంపై కేసు నమోదు చేయాలని అఖిలపక్ష నేతలు డిమాండ్ చేశారు. విషపూరిత, నాణ్యతలేని ఆహారాన్ని అందించే పీఎస్‌-4 హోటల్ పనితీరును వ్యతిరేకిస్తూ సీపీఎం కార్యాలయంలో ఆదివారం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. సీపీఎం నగర కార్యదర్శి టి.సుబ్రమణ్యం అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ఆర్‌పీఐ రాష్ట్ర అధ్యక్షుడు పి.అంజయ్య, టీటీడీ బోర్డు మాజీ సభ్యుడు ఓవీ రమణ, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు శివకుమార్, స్థానిక హక్కుల పోరాట కమిటీ నేత డీఎంసీ.భాస్కర్, సీపీఎం నేతలు ఎం.మాధవ్, వేణుగోపాల్ పాల్గొని ప్రసంగించారు. పీఎస్4 హోటల్‌లో కుళ్లిన కూరగాయలు, కాలం చెల్లిన ఆహార పదార్థాలను కస్టమర్లకు, భక్తులకు పెట్టడాన్ని తీవ్రంగా ఖండించారు. ఫుడ్ ఇన్‌స్పెక్టర్లు, హెల్త్ అధికారులు అన్ని హోటళ్లలో వెంటనే తనిఖీలు నిర్వహించి, నాణ్యత ప్రమాణాలు పాటించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సీపీఎం నేతలు ఎస్‌జే.చంద్ర, పి.బుజ్జి, నరేంద్ర, మల్లికార్జునరావు, మునిరాజా, రవి, పార్థసారథిరెడ్డి, శ్రీరాములు, శివ, మోహన్‌రావు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే ఆరణికి ఆర్యవైశ్యుల సత్కారం



ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు దంపతులను సత్కరిస్తున్న ఆర్యవైశ్య నేతలు

తిరుపతి కల్చరల్: ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో కరకంబాడి రోడ్డులోని ఓ ప్రైవేటు సమావేశ మందిరంలో ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు దంపతులను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు దిండుకుర్తి నరసింహులు మాట్లాడుతూ ఆర్యవైశ్యుల అభ్యున్నతికి చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే తిరుమల శ్రీవారి దర్శనం ప్రతి నెలా రెండో మంగళవారం స్థానికులకు కల్పించాలని కోరారు. ఆర్యవైశ్య సంఘం కార్యదర్శి శ్రీధర్, కోశాధికారి హేమచంద్రకుమార్, రాష్ట్ర ఆర్యవైశ్య యువజన విభాగం అధ్యక్షుడు వికాస్, ద్వారక పాల్గొన్నారు.

నేడు పబ్లిక్ గ్రీవెన్స్



తిరుపతి తుడా: తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ప్రజల సమస్యల పరిష్కారం కోసం పబ్లిక్ గ్రీవెన్స్ (పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెస్సల్ సిస్టమ్)ను నిర్వహించనున్నట్లు కమిషనర్ అదితిసింగ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమాన్ని ఉదయం10 నుండి మధ్యాహ్నం 1 గంట వరకు నిర్వహించనున్నట్లు చెప్పారు. నగర ప్రజలు మున్సిపల్ కార్పొరేషన్‌కు సంబంధించిన సమస్యల పరిష్కారానికి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇకపై ప్రతి సోమవారం మీకోసం – ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆమె తెలిపారు.

ప్లాటినం లయన్స్ క్లబ్ అధ్యక్షుడిగా తులసీరామన్



లయన్స్ క్లబ్ అధ్యక్షుడు తులసీరామన్

పాకాల: పాకాల ప్లాటినం లయన్స్ క్లబ్ అధ్యక్షుడిగా తులసీరామన్ ఎన్నికయ్యారు. ఆదివారం పాకాల ప్లాటినం లయన్స్ క్లబ్ నూతన కార్యవర్గాన్ని సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్టు ప్రస్తుత క్లబ్ అధ్యక్షుడు మారసాని విజయబాబు తెలిపారు. జూలై ఒకటో తేదీ నుంచి కొత్త కార్యవర్గం బాధ్యతలు తీసుకుంటుందని వివరించారు. ఉపాధ్యక్షుడిగా మారసాని నాగేంద్ర, కార్యదర్శిగా పోతుగుంట అనీల్ కుమార్, కోశాధికారిగా మారసాని మహేష్లను సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు.

రైల్వేస్టేషన్‌లో గుర్తు తెలియని వ్యక్తి మృతి



గుర్తు తెలియని వ్యక్తి మృత దేహం

పాకాల: రైల్వేస్టేషన్‌లో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన ఆదివారం చోటు చేసుకుంది. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. రైల్వే స్టేషన్‌లోని మూడో నెంబర్ ప్లాట్‌ఫారంపై గుర్తు తెలియని వ్యక్తి మృతి చెంది ఉండగా గుర్తించామని తెలిపారు. ఇతడిని యాచకుడిగా భావిస్తున్నట్లు పేర్కొన్నారు. మృతుడు బ్లూ కలర్ గళ్లచొక్కా, జీన్స్ ప్యాంట్ ధరించి ఉన్నాడని అతని వద్ద అంతకుమించిన ఆధారాలేవీ లభించలేదన్నారు. ఈ సంఘటనపై రైల్వే ఎస్ఐ ప్రవీణ్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


ముగ్ధ మనోహరం

తిరుమల కొండల్లో ప్రకృతి సోయగం అత్యంత సహజం. జలపాతాలు.. ఎత్తైన కొండలు.. పచ్చదనంతో నిండి ఉంటుంది శేషాచలం అటవీ ప్రాంతం. ప్రస్తుతం తిరుమల ఘాట్‌రోడ్లకు ఇరువైపులా పూల అందాలు ఆకట్టుకుంటున్నాయి. ముగ్ధ మనోహరంగా కనువిందు చేస్తున్నాయి. శ్రీవారి దర్శనార్థం వచ్చే భక్తులు సైతం అందాల పూల చెట్ల వద్ద నిలుచుని సెల్ఫీలు దిగుతున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, తిరుపతి



తిరుమల నుంచి తిరుపతికి వచ్చే మొదటి ఘాట్‌రోడ్డులో పుష్పసోయగం





తిరుపతి నుంచి తిరుమలకు వెళ్లే రెండో ఘాట్‌రోడ్డులో ఆకర్షిస్తున్న పూల మొక్కలు

ఐఎస్ఏ నూతన కార్యవర్గం ఎన్నిక



జాతీయ కౌన్సిల్ బ్రోచర్ ఆవిష్కరణ

తిరుపతి తుడా: ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ అనస్తీషియా కార్యవర్గ సమావేశంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఓ ప్రైవేట్ హోటల్లో ఆదివారం ఈ ఎన్నిక నిర్వహించారు. రాష్ట్ర అధ్యక్షుడిగా డాక్టర్ తారక ప్రసాద్‌ను మరోసారి అధ్యక్షుడిగా ఎన్నుకున్నారు. మదర్ హాస్పిటల్ చైర్మన్ డాక్టర్ మదన్‌ను రాష్ట్ర సెక్రటరీగా, కోశాధికారిగా డాక్టర్ శ్రీనివాస్ సూరినేనితోపాటు ఎగ్జిక్యూటివ్ సభ్యులను ఎన్నుకున్నట్లు ప్రకటించారు . అనంతరం సెప్టెంబర్ నెలలో ఎస్వీ మెడికల్ కళాశాలలో నిర్వహించే రాష్ట్రస్థాయి ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ అనస్తీషియా కాన్ఫరెన్సు చర్చించారు. ఈ కార్యక్రమంలో పూర్వపు సెక్రటరీ డాక్టర్ అచ్యుత రామయ్య, ట్రెజరర్ డాక్టర్ శ్రీనివాస్, ఆర్గనైజింగ్ కమిటీ చైర్మన్ డాక్టర్ రాధ, ఇతర సభ్యులు డాక్టర్ ప్రదీప్, డాక్టర్ కామేశ్వరరావు, డాక్టర్ భీమేష్, డాక్టర్ కిరణ్, డాక్టర్ మోహన్ భాస్కర్, డాక్టర్ వేణుగోపాల్, డాక్టర్ ప్రశాంతి పాల్గొన్నారు.

శ్రీవారిని దర్శించుకున్న ప్రముఖులు

తిరుమల: తిరుమల శ్రీవారిని ఆదివారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. ఇందులో రాష్ట్ర హోం మంత్రి అనిత, ఎమ్మెల్యే పత్తిపాటి పుల్లారావు, ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప, ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం ఉన్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. శ్రీవారి దర్శనానంతరం ఆలయ రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనాలు అందించగా.. టీటీడీ అధికారులు ఘనంగా లడ్డూ ప్రసాదాలతో సత్కరించారు.

ఎన్డీఏ కూటమి ఆధ్వర్యంలో ఏపీ అభివృద్ధి

ఆలయం ఎదుట ఏపీ హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత మాట్లాడుతూ.. హోంశాఖ అత్యంత వేగంగా పనిచేస్తుందని తెలిపిన ఆమె చీరాలలో దారుణంగా అత్యాచారం చేసిన ఘటనలో 36 గంటల్లోనే నిందితులను పట్టుకున్నామని స్పష్టం చేశారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూసుకొనే బాధ్యత తమపై ఉందని పేర్కొన్నారు.





శ్రీవారి ఆలయం ఎదుట హోం మంత్రి అనిత, ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం

పుష్పలోకేష్‌కు మిసెస్ ఇండియా అవార్డు



కన్నడ సినీ నటుడు భార్గవ్ నుంచి మిసెస్ ఇండియా అవార్డు అందుకుంటున్న పుష్పాలోకేష్

తిరుపతి కల్చరల్: సిల్వర్‌టక్ బెంగళూరు ఆధ్వర్యంలో నిర్వహించిన అందాల పోటీలలో రన్నరప్‌గా నిలిచిన తిరుపతికి చెందిన సి.పుష్పాలోకేష్‌కు మిసెస్ ఇండియా అవార్డు లభించింది. బెంగళూరులో ఈనెల 9వ తేదీ నుంచి మూడు రోజులపాటు మిస్, మిసెస్ క్లాసిక్, మిసెస్ ప్రీమియం తదితర మూడు విభాగాలలో జరిగిన ఈ జాతీయ స్థాయి పోటీలకు 700 మందికి దరఖాస్తు చేసుకున్నారు. ఇందులో ఉత్తమ ప్రతిభతో ఎంపికైన 30 మంది ఈ పోటీలలో పాల్గొన్నారు. మిసెస్ క్లాసిక్ విభాగంలో పుష్పాలోకేష్ మిసెస్ ఇండియా అవార్డుకు ఎంపికైంది. ప్రముఖ కన్నడ నటుడు భార్గవ్ చేతులమీదుగా ఆమె ఈ అవార్డును అందుకున్నారు.

శ్రీవారి సేవలో ఆండవన్ మఠం పీఠాధిపతి



శ్రీరంగం శ్రీమద్ ఆండవన్ ఆశ్రమం పీఠాధిపతి వరాహ మహాదేశికన్ స్వామితో ఆలయ అధికారులు

తిరుమల: తిరుమల శ్రీవారిని ఆదివారం శ్రీరంగం శ్రీమద్ ఆండవన్ ఆశ్రమం పీఠాధిపతి వరాహ మహాదేశికన్ స్వామి దర్శించుకున్నారు. తిరుమల బేడి ఆంజనేయ స్వామి వద్దకు చేరుకున్న ఆయనకు టీటీడీ అధికారులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం ఆయనకు తీర్థ ప్రసాదాలను అందజేశారు.



● రంగుల సేతు

ఆధ్యాత్మిక క్షేత్రమైన తిరుపతి నగరంలో ఆదివారం సాయంత్రం చిరుజల్లులు కురిశాయి. దీంతో లీలామహల్ సర్కిల్లో శ్రీనివాససేతు విద్యుత్ కాంతులతో వెలుగులీనింది. వాహనాల లైటింగ్ మధ్య రంగులు విరిశాయి.

– సాక్షి ఫొటోగ్రాఫర్, తిరుపతి



గౌడ సంక్షేమ సంఘం ఎన్నిక

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి నియోజకవర్గ గౌడ సంక్షేమ సంఘం నూతన కార్యవర్గాన్ని జిల్లా నాయకులు పురుషోత్తంగౌడ్, ఉదయగిరి మోహన్‌గౌడ్, ముద్ద రాధాకృష్ణ, చిట్టెం శంకరయ్య ఆధ్వర్యంలో ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా తిరకాల ఆనంద్‌గౌడ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యదర్శిగా వెంకటరమణ గౌడ్, కార్యనిర్వాహకులుగా గణేష్ గౌడ్‌ను ఎన్నుకున్నారు.

ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు



భరత నాట్యంతో అలరిస్తున్న కళాకారులు

చంద్రగిరి(తిరుచానూరు): వారాంతపు సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా తిరుచానూరు శిల్పారామంలో ఆదివారం సాయంత్రం నిర్వహించిన భరత నాట్య ప్రదర్శన ప్రేక్షకులను అలరించింది. చెన్నైకు చెందిన శ్రీశంకర నాట్య విద్యాలయ కళాబృందం ఆధ్వర్యంలో నిర్వహించిన భరత నాట్యం విశేషంగా ఆకట్టుకుంది. ఇందులో భాగంగా గణపతి కీర్తనలు, త్యాగరాజ కీర్తనలు, పెరుమాళ్ కీర్తనలకు నాట్యం చేసి అలరించారు. చెన్నైకు చెందిన డాక్టర్ మీనాక్షి బృందం, సరస్వతి బృందం, విల్లుపురానికి చెందిన సౌమ్య సత్యరాజ్ బృందం, కోయంబత్తూరుకు చెందిన మైథిలి ముఖేష్ బృందాల కళాకారులు తరుశ్రీ, పొన్నమాదియల్, రగని, అక్షిత, పాజశ్రీ, కిరణ్యశ్రీ, నీలా, లవినా తన్సీ, ధనస్మిత, ఒరియా, రోషిత, సత్యమణితో పాటు మరో 28 కళాకారుల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కళాకారులను ఏఓ ఖాదర్‌వల్లీ సత్కరించి, జ్ఞాపికలను అందజేశారు. రాధాకృష్ణ, పప్పి, వరప్రసాద్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.



ఘనంగా ముగిసిన సప్తగిరి సంగీత సప్తాహం



కళాకారులను సత్కరిస్తున్న నిర్వాహకులు

తిరుపతి కల్చరల్: అన్నమాచార్య ప్రాజెక్టు కళాకారుల సహకారంతో మనోవికాస్ నిర్వాహకుడు, మృదంగ విద్వాంసుడు పున్నమరాజు మురళీకృష్ణ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సప్తగిరి సంగీత సప్తాహం ఆదివారంతో ఘనంగా ముగిసింది. యశోదనగర్‌లోని వేమన విజ్ఞాన కేంద్రం ఆడిటోరియంలో వారం రోజులపాటు నిర్విరామంగా సాగిన ఈ కార్యక్రమ ముగింపు వేడుక ఘనంగా నిర్వహించారు. అంతర్జాతీయ స్థాయిలో చేపట్టిన ఈ సప్తగిరి సంగీత సప్తాహం కార్యక్రమం ఏడు రాత్రులు, ఏడు పగళ్లు 168 గంటలపాటు నిర్విరామంగా సాగింది. ఇందులో వివిధ రాష్ట్రాలకు చెందిన శాస్త్రీయ సంగీత, సంప్రదాయ నామసంకీర్తనలు, హరికథా గానం, పురంధరదాసాది కన్నడ వాగ్గేయకారుల కీర్తనల గానం, భద్రాచల రామదాస, అపురూప వాగ్గేయకారుల కీర్తనలు, కృతుల గానం, అన్నమాచార్య సంకీర్తనల విభావరి, అన్నమాచార్య భక్తి భావ స్వర తరంగాలతో ఈ సప్తగిరి సంగీత సప్తాహం సాగింది. కార్యక్రమంలో 600 మంది కళాకారులు పాల్గొని తమ దైన శైలిలో అద్భుత రీతిలో ప్రదర్శనలు అందించారు. కళాకారులను నిర్వాహకుడు మురళీకృష్ణ, వేమన విజ్ఞాన కేంద్రం ప్రతినిధి మల్లారపు నాగార్జున శాలువాలు, జ్ఞాపికలతో ఘనంగా సత్కరించారు. వారం రోజుల సప్తగిరి సంగీత సప్తాహ విజయవంతానికి సహకరించిన కళాకారులకు, వాయిద్య కారులకు, అన్నమాచార్య ప్రాజెక్టు కళాకారులకు ఈ సందర్భంగా ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి

తిరుపతి కల్చరల్: బాపట్ల జిల్లాలో యువతిపై అత్యాచారం చేసి, హత్య చేసిన నేరస్తులను కఠినంగా శిక్షించాలని అఖిల భారత మహిళా సాంస్కృతిక సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎల్ఎస్.లక్ష్మి సింగ్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. బాపట్ల జిల్లా చీరాల మండలం, ఈపూరుపాలెం రైల్వేస్టేషన్ సమీపంలో సీతారామ పేటకు చెందిన 21 ఏళ్ల యువతి బహిర్భూమికి వెళ్లిన సమయంలో ఆమెపై అత్యాచారం చేసి, హత్య చేయడం దుర్మార్గపు చర్య అని పేర్కొన్నారు. ప్రభుత్వాలు మారినా మహిళలకు గౌరవం, భద్రత లేవని తెలిపారు. మహిళలకు తగినన్ని మరుగుదొడ్లు కల్పించకపోవడంతో ఇలాంటి దుశ్చర్యలకు గురవుతూ ప్రాణాలు కోల్పోతున్నారని తెలిపారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం స్పందించి మద్యం, మత్తు పదార్థాలు, గంజాయి, అశ్లీలత, హింసను ప్రోత్సహించే సినిమా, టీవీ కార్యక్రమాలను నిర్మూలించే కఠిన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. తగినన్ని మరుగుదొడ్లను నిర్మించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆమె డిమాండ్ చేశారు.

వేద నారాయణ స్వామి ఆలయంలో అన్నదానం



అన్నదానం చేస్తున్న ఉభయదారులు

నాగలాపురం: టీటీడీ అనుబంధంగా ఉన్న మత్స్యావతార క్షేత్రమైన శ్రీవేదవల్లి సమేత శ్రీవేదనారాయణ స్వామి ఆలయంలో ఆదివారం అన్నదాన సేవా కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి హైదరాబాద్‌కు చెందిన కె.లావణ్య, ఆమె కుటుంబ సభ్యులు ఉభయదారులుగా వ్యవహరించారు. అనంతరం ధర్మరక్షణ సమితి బాల సంస్కార కేంద్రంలోని చిన్నారులకు ఆలయ ఇన్‌స్పెక్టర్ చెంగల్రాయులు భగవద్గీత సారాంశాన్ని పిల్లలకు వివరించారు. చిన్నారులకు నోటుపుస్తకాలు, పెన్నులు, పలకలు అందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ షరాబు ఉదయ్ కుమార్, ధర్మరక్షణ సమితి కోశాధికారి రఘు, సమితి సభ్యులు పాల్గొన్నారు.

అద్వితీయం... నాట్య నీరాజనం

తిరుపతి కల్చరల్: మహతి కళాక్షేత్రంలో నిర్వహించిన అయోధ్య రామునికి నాట్య కళా నీరాజనం కార్యక్రమం ఆదివారంతో ఘనంగా ముగిసింది. ఫ్రైడ్ ఇండియా కల్చరల్స్, సిటిజెన్స్ వెల్ఫేర్ ఫోరం సంయుక్త ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు ఈ కార్యక్రమం సాగింది. అత్యుత్తమ ప్రతిభ చాటిన నాట్య గురువులు, కళాకారులకు ఫ్రైడ్ ఇండియా కల్చరల్స్ సీఈఓ కోలా వెంకటేశ్వరరావు అయోధ్యరామ అవార్డ్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ అవార్డులు, ఇండియన్ ఫ్రైడ్ సెలబ్రిటీ వంటి ప్రతిష్టాత్మక పురస్కారాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్రపతి అవార్డు గ్రహీత, ప్రముఖ నాట్యాచార్యుడు వేదాంత రాధేశ్యామ్, నాట్య గురువు దేవేంద్రపిళ్లై పసుమర్తి శేషుబాబు, డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్, ఎంజీ.బాలాజీ, ప్రసాద్, కృష్ణయ్య, కోలా సంగీత రావు, కళాకారులు పాల్గొన్నారు.



జానపద నృత్య ప్రదర్శన



కళాకారులకు అవార్డులతో సత్కారం

ఘనంగా శ్యాంప్రసాద్ ముఖర్జీ జయంతి

తిరుపతి గాంధీ రోడ్: భారతీయ జనసంఘ్ వ్యవస్థాపకుడు డాక్టర్ శ్యాం ప్రసాద్ ముఖర్జీ వర్ధంతి కార్యక్రమాన్ని తిరుపతి గంగమ్మ గుడి శక్తి కేంద్ర ఇన్‌చార్జ్ గుండాల గోపీనాథ్ ఆధ్వర్యంలో ప్రధాన తపాలా కార్యాలయం వద్ద నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ముఖ్య అతిథులుగా విచ్చేసిన బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పెనుబాల చంద్రశేఖర్, రాయలసీమ అభివృద్ధి కమిటీ కన్వీనర్ డాక్టర్ శ్రీహరి రావు మాట్లాడుతూ డాక్టర్ శ్యాంప్రసాద్ ముఖర్జీ భారతీయ జనతా పార్టీ ఆవిర్భావానికి జీవం పోశారని కొనియాడారు. తొండమనాటి సుబ్రహ్మణ్యంరెడ్డి, పాటిబండ మురళి, గుండాల నాయక్ పాల్గొన్నారు.



శ్యాంప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు